

వరసిద్ధుడి దర్శనానికి 4గంటలు

స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఉదయం నుంచే తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో స్వామి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తుల మధ్య ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

- ఐరాల(కాణిపాకం), ఆంధ్రజ్యోతి



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

10 మద్యం దుకాణాలకు 79 దరఖాస్తులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు శనివారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. 10 మద్యం దుకాణాలకు 79 దరఖాస్తులు వచ్చాయి. తొలుత ఈనెల 5వ తేదీవరకు దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐదో తేదీకి 13 దరఖాస్తులే వచ్చాయి. దీంతో గడువును 8వ తేదీవరకు పొడిగించడంతో 79 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు రుసుం రూ.2లక్షలు కావడంతో ప్రభుత్వానికి రూ.1.58 కోట్ల ఆదాయం వచ్చింది.

రేపు లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు

10 మద్యం దుకాణాలకు సోమవారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా పారదర్శకంగా కేటాయిస్తారు. ఒక వ్యక్తికి ఒక దుకాణం మాత్రమే కేటాయిస్తారు. లాటరీ ప్రక్రియకు సంబంధించిన అన్ని పనులను ఇప్పటికే పూర్తిచేశామని ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాస్ తెలిపారు.



తిరుపతిలో మీనాక్షి

ప్రముఖ సినీనటి మీనాక్షి చౌదరి శనివారం తిరుపతి వచ్చారు. నగరంలో ఓ షోరూమును ప్రారంభించిన ఆమె అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా పాటలకు స్టెప్స్ వేస్తూ యువకుల్లో ఉత్సాహం నింపారు.అనంతరం మీడియాతో మాట్లాడారు. హీరో నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తొలి సినిమాలో హీరోయిన్‌గా మిమ్మల్ని అనుకుంటున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోందనగా తనకు ఈ విషయం తెలియదని, అవకాశం వస్తే తప్పక నటిస్తానన్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలి





వేదికపై న్యాయమూర్తులు, అతిథులు- కోర్టు భవనాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటనారాయణ భట్,హైకోర్టు ఛీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

పలమనేరు, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి) : సమస్యలతో వచ్చే ప్రజలకు సకాలంలో న్యాయం అందించడం ద్వారా న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగించాల్సిన బాధ్యత అందరిపై వుందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకట నారాయణ భట్ పేర్కొన్నారు. పలమనేరులో రూ. 15.18 కోట్లతో నిర్మించిన నాలుగు కోర్టు భవనాల సముదాయాన్ని, నలుగురు న్యాయమూర్తుల నివాస భవనాల సముదాయాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెవాసిగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు న్యాయవాదులతో తనకు సత్సంబంధాలున్నాయన్నారు.పలమనేరులో మెరుగైన మౌలిక సదుపాయాలతో న్యాయస్థాన భవనం నిర్మించడం జరిగిందన్నారు. న్యాయవాదుల్లో నూతనోత్సాహాన్ని పెంపొందించడానికి, ప్రజలకు న్యాయవ్యవస్థపై మరింత నమ్మకం కలిగించడానికి స్వయంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యానన్నారు.హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ పలమనేరులో కోర్టు భవనాల సముదాయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు వీరికి కలెక్టర్ సుమిత్‌కుమార్,ఎస్పీ మణికంఠ స్వాగతం పలకగా పురోహితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.అనంతరం జస్టిస్ వెంకటనారాయణ భట్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సర్వమత ప్రార్థనలు చేసిన తరువాత నూతన భవనాల సముదాయాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి, చిత్తూరు అడ్మినిస్ట్రేషన్ జడ్జి జస్టిస్ కృష్ణమోహన్, హైకోర్టు జస్టిస్ టీసీడీ శేఖర్, చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, తిరుపతి మూడవ అదనపుజిల్లా జడ్జి గురునాథ్, చిత్తూరు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.పి.డి. వెన్నెల ,డీఎల్‌ఎస్ఏ సెక్రటరీ భారతి, పలమనేరు సివిల్ జడ్జి ఆదినారాయణ, సివిల్ జడ్జి లిఖిత, స్పెషల్ మెజిస్ట్రేట్ రాధమ్మ, ఆర్డీవో భవాని, ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకనాథరెడ్డి, పలమనేరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. లక్ష్మీపతి,న్యాయవాదులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలమనేరులో అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కుజస్టిస్ బి.కృష్ణమోహన్‌కు పలమనేరు, కుప్పం బార్ అసోసియేషన్ అధ్యక్షులు వినతిపత్రం అందజేశారు.

లారీ,ఆటో ఢీ

● వధూవరులు సహా 10మందికి గాయాలు

గంగాధర నెల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : గంగాధర నెల్లూరు సమీపంలో శనివారం రాత్రి లారీ,ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో పదిమంది గాయపడ్డారు.పోలీసుల కథనం మేరకు...గంగాధరనెల్లూరు మండలం అగరమంగళం దళితవాడకు చెందిన బాబు కుమార్తె కవితకు, యాదమరి మండలం కీనాటంపల్లె పంచాయతీ గుట్టపై (కోడూరు) దళితవాడకు చెందిన మణి కుమారుడు రాము(రామన్)కు యాదమరిలో శుక్రవారం ఉదయం వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో వధూవరులతో పాటు వరుడి బంధువులు శనివారం మధ్యాహ్నం ఆటోలో వధువు ఇంటికి మరివేలు(డిన్నర్)కు వచ్చారు.తిరిగి రాత్రి అగరమంగళం దళిత వాడ నుంచి యాదమరిలోని వరుడి ఇంటికి బయల్దేరారు. ఆటోలో వధూవరులతో పాటు 11మంది బంధువులు న్నారు.గంగాధర నెల్లూరు సమీపంలో వీరి ఆటో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో 10మంది గాయపడ్డారు.వీరిలో వధూవరులతో పాటు కోదండన్, పెరియస్వామి, చిత్ర, సఖి,శివమ్మ,రజన, రాబిన్, పవిత్ర వున్నారు.వీరిలో పెరియస్వామి పరిస్థితి ఆందోళనకరంగా వుంది. గాయపడ్డవారందరినీ చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి తెలిపారు. పెరియస్వామిని మెరుగైన చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీకి తరలించినట్లు తెలిపారు.





చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు







శాస్త్రోక్తంగా భీష్మ ఏకాదశి వేడుకలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదట స్వామి అమ్మవార్లు, వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఉత్సవమూర్తులకు అలంకార మండపంలో అభిషేక పూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. సంప్రదాయం ప్రకారం విజ్ఞానగిరి వద్ద కొంతసేపు ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. పూజల అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయానికి చేరుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.





అలిపిరి పాదాలమండపం కిటకిట

వరుస సెలవులకు తోడు రెండవ శనివారం అలిపిరి పాదాల మండపం భక్తులతో కిటకిటలాడింది. శనివారం పాదాల మండపం దర్శిస్తే శ్రీవారిని చూసినట్టేనని భక్తులు భావిస్తుంటారు. ఈ క్రమంలోనే సాయం సంధ్య వేళ ఆహ్లాదకర వాతావరణంలో భారీగా భక్తులు పాదాలమండపం వద్దకు చేరుకున్నారు. పండితలిగ, దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న గోశాలను సందర్శించారు. ఇతర ప్రాంతాల వచ్చిన భక్తులు, స్థానికులు కలవడంతో కొబ్బరికాయల సమర్పణ ప్రాంతం కూడా కిక్కిరిసింది. దారిపొడవునా ఇరువైపులా ద్విచక్రవాహనాల పార్కింగ్ చాంతాడులా వ్యాపించింది. దీంతో గరుడ కూడలి వద్ద పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది. సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. ఆ ప్రాంతమంతా గోవిందనామస్మరణలు మార్మోగింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి





శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. ఇక వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.2.99 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,971

తలనీలాలు సమర్పించిన వారు: 24,439





చుట్టూ వనం..

ఎంచక్కా భోజనం

● అడవి సెట్టింగుల మధ్య అనుభూతుల విందు





కంగారు పడకండి..ఇదేంటి అడవిలో భోజనం చేస్తున్నారేంటనుకుంటున్నారా.. మీరే కాదు ఎవరైనా అలా భావించాల్సిందే. ఇక్కడకు వస్తే అచ్చం అడవిని తలపించే వాతావరణమే. కాలానుగుణ అభిరుచుల్లో ఇదొకటి. కొందరికి సరదాగా అటవీ ప్రాంతంలో భోజనం చేయాలనే కోరిక ఉంటుంది. అలాగని అడవికి పోలేం కదా..అందుకే అలాంటి వాతావరణాన్ని కృత్రిమంగా సృష్టించి ఆహారప్రియులకు ఆకట్టుకుంటోంది కపిలతీర్థం సమీపంలోని ఫై వైస్‌రాయ్ హోటల్. పచ్చని చెట్ల పందిరి, పక్షులు, జంతువుల రూపాల సెట్టింగుల మధ్య తింటుంటే అదే ఫీలింగ్ కలుగుతుంది. ఇందులోని గుహా రెస్టారెంట్‌లో



అడుగుపెట్టగానే గుహపై పెద్ద పులి నిద్రిస్తున్నట్లు కనిపిస్తుంది. రాజుల కాలం మాదిరిగా ఇద్దరు భటుల విగ్రహాలు ఆరంభంలోనే ఆకర్షిస్తాయి. లోపలకు వెళుతుంటే అడవిలో అడుగుపెడుతున్న అనుభూతి కలుగుతుంది. అటవీశాఖ యూనిఫారం తరహాలోనే సిబ్బంది దుస్తులు వేసుకుంటారు. ముత్యాల స్పెషల్ మటన్ బిరియాని, మటన్ ఫ్రై, మెంతాకు కోడి వేపుడు, టైగర్ చికెన్ ఇలా చికెన్‌లో వంద రకాలు, మటన్‌లో 50 రకాలు, ఫిష్‌లో 50, ప్రాన్స్‌లో 20 రకాల వంటకాలను ఆస్వాదించవచ్చు. శాఖాహారుల కోసం గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేకంగా భోజనం ఉంటుంది. పిల్లల కోసం ఓ ఆటల గది కూడా ఏర్పాటు చేశారు.

- తిరుపతి(వైద్యం)

ముగ్గురు 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్ట్

● రూ.25 లక్షల దుంగల స్వాధీనం

మంగళం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట-కడప హైవేలోని కరకంబాడి సమీపంలోని నెలవాగు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో డంప్ చేసి ఉంచి 26 ఎర్రచందనం దొంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు తిరుపతి రేంజ్ అటవీ క్షేత్రాధికారి బి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రహస్య సమాచారం మేరకు శుక్రవారం రాత్రి సిబ్బందితో కలిసి కరకంబాడి వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద నిఘా వేసినట్లు చెప్పారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన నలుగురు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను బయటకు తీస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. రఘు అనే వ్యక్తి పారిపోయాడని తెలిపారు. మోటార్ సైకిళ్లను, ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.26 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ దాడుల్లో తిమ్మినాయుడుపాలెం సెక్షన్ ఎఫ్ఎస్‌వో రమేష్‌బాబు, ఎఫ్‌బీవోలు వెంకటేశ్వరరావు, కిషోర్‌కుమార్, సురేష్‌బాబు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.



స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న అటవీ శాఖ అధికారులు

సూర్యఘర్ యోజక పథకాన్ని వినియోగించుకోండి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకాన్ని గృహ విద్యుత్ వినియోగదారులు ఉపయోగించుకోవాలని తిరుపతి, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, మురళీమోహన్ కోరారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం పీఎం సూర్యాఘర్ యోజక పథకం అవగాహన మేళాను వారు ప్రారంభించారు. ఏడు కంపెనీల వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వారు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు నిర్మించుకోవాలన్నారు. వేసవికాలంలో విద్యుత్ కొరతను తగ్గించడానికి ఇది దోహదపడుతుందని చెప్పారు. ఇలాంటి పథకాలను గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా విస్తరింపజేయాలన్నారు. ఈ పథకం లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. సోలార్ రూఫ్‌టాప్ అవగాహన మేళా ఆది, సోమవారాల్లో నిర్వహిస్తామని ఎస్ఈ పి.సురేంద్రనాయుడు చెప్పారు. కార్యక్రమంలో సీజీఎంలు రమణాదేవి, వరకుమార్, ఏఎస్‌డీ మునిశంకరయ్య, ఈఈలు వి.చంద్రశేఖరరావు, పుల్లా బాలాజీ, వాసవీలత, సర్కిల్ ఎస్ఏవో శ్రీనివాసులు, డిఈఈలు, ఏఈలు, ఏఏవోలు పాల్గొన్నారు.



సోలార్ ప్యానల్స్‌ను పరిశీలిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

నత్తేనయం

● కొనసా..గుతున్న ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులు

● ఐదేళ్లుగా భక్తులకు దూరమైన చరిత్ర సమూహం



తిరుమల ఎస్వీ మ్యూజియం

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపించే ప్రపంచం, జాతి సంస్కృతికి ఆనవాళ్లు, ఎన్ని తరాలవారికైనా కనిపించే చెక్కుచెదరని రూపాలు కొలువై ఉన్న ఎస్వీ మ్యూజియం భక్తులకు దూరమై ఐదేళ్లు గడుస్తోంది. అభివృద్ధి పేరుతో ఎస్వీ మ్యూజియాన్నే మర్చిపోయేలా చేశారు. పూర్వం మ్యూజియం శ్రీవారి ఆలయం ముందున్న వేయికాళ్ల మండపంలో ఆర్ష సంస్కృతి సదస్సు పక్కనే ఉండేది. అందుకే క్రమంగా సందర్శకులు పెరుగుతున్న క్రమంలో 1996లో నారాయణగిరి పర్వతం అనుకుని సువిశాలంగా శ్రీవేంకటేశ్వర మ్యూజియం పేరుతో రూ.3.5కోట్లతో నిర్మించారు. మొత్తం 7గ్యాలరీలు, ఒక మినీ థియేటర్‌ను రూపొందించారు. 14, 15, 16 శతాబ్దాల నాటి రాతి, లోహ, స్ఫటిక, పాలరాతి విగ్రహాలు, పురాతన వాయిద్యాలు, రాజులు వాడిన కత్తులు, రక్షణ కవచం, యుద్ధంలో వినియోగించిన ఆయుధాలు, ముఖ్యంగా మైసూరు మహారాజు సమర్పించిన దంతపు పల్లకీ ఈ మ్యూజియం ద్వారా భక్తులకు దర్శనమిచ్చేవి. ఇక, బ్రహ్మోత్సవాలలో నిర్వహించే వాహనాలు, పుణ్యతీర్థాలు, నిజపాదాల రూపం, దశావతారాల ప్రతిమలు, శ్రీవారి ఆలయాన్ని అంచెలంచెలుగా నిర్మించిన సామంతరాజులు, శ్రీకృష్ణదేవరాయలు, తోడరమల్లు, అచ్యుతదేవరాయలు, అట్ల కుమార అనంతరాజులు, వెంకటపతి దేవరాయల ఫొటోలు కూడా ఉండేవి. ప్రత్యేకించి కపిలతీర్థం, తిరుచానూరు అమ్మవారి ఆలయంలో ఉపయోగించిన 18వ శతాబ్దానికి చెందిన గంటలు, కొయ్య పాదుకలు, స్వామివారి నిలువెత్తురూపం, ఇత్తడి పాదుకలు, రాగి పళ్లెం, దీప-ధూప స్తంభాలు, రాయలకాలం నాటి సంగీత వాయిద్యాలు, శ్రీనివాసమంగాపురం, గోవిందరాజుల స్వామి ఆలయ ప్రధాన ద్వారాలు, 17వ శతాబ్దం నాటి అలిపిరి వద్ద చెక్క మండపం, శ్రీకృష్ణలీలలు, శ్రీవారి రథంపై అలంకరించే తపోతదూళం, గరుడ, ద్వార పాలకుల విగ్రహాలు, వందల ఏళ్ల క్రితం నాటి నాణేలు, వస్తువులు, శాసనాలు, రాగిరేకులు ఇలా చరిత్రకు సంబంధించి అనేక వస్తువులను ఎస్వీ మ్యూజియం ద్వారా భక్తులు తిలకించేవారు.

రూ.125 కోట్లతో ముందుకు వచ్చిన టాటా సంస్థ

తిరుమలోని ఈ మ్యూజియాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలని టీటీడీ నిర్ణయించగా, అందుకు టాటా సంస్థ ముందుకు వచ్చింది. రూ.125 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు అంగీకారం తెలిపింది. అలాగే బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ సంస్థ కూడా 'టెంపుల్ ఎక్స్‌పీరియన్స్ గ్యాలరీ' ఏర్పాటుకు రూ.20 కోట్లు ఇచ్చేందుకు ముందుకు రావడంతో 2020 మార్చి నుంచి మ్యూజియానికి భక్తుల అనుమతిని టీటీడీ రద్దు చేసింది. ఆ పనులు నేటికీ నత్తనడకన కొనసాగుతున్నాయి. కొవిడ్ ఆంక్షలతో కొంతకాలం పనులు ఆగిపోతే, అధికారుల నిర్లక్ష్యంతో మరికొంతకాలం నత్తనడకన సాగినట్టు ఆరోపణలున్నాయి. గతేడాది బ్రహ్మోత్సవాల నాటికైనా ఆధునీకరణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నించినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. దీనికి కారణం సరైన మ్యూజియం అధికారులు లేకపోవడమనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో టాటా సంస్థకు చెందిన ప్రతినిధులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.



సవిత - విజయభారతి - శోభారాజ్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.వారిలో రాష్ట్ర మంత్రి సవిత, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయభారతి, ప్రముఖ గాయని శోభారాజ్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

పదవ తరగతి పరీక్షలకు కసరత్తు ప్రారంభం

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. మార్చి 17 నుంచి జరగనున్న ఈ పరీక్షలపై జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్ ఫోకస్‌పెట్టారు. 310 ప్రభుత్వ పాఠశాలల నుంచి 15,455 మంది, 266 ప్రైవేటు పాఠశాలల నుంచి 11,548 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరితోపాటు గతంలో ఫెయిలైన 634 మంది పరీక్షలు రాయనున్నారు. వీరందరి కోసం 164 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యాశాఖాధికారుల సూచనల మేరకు ఈ కేంద్రాల్లో పోలీసుశాఖ భద్రతా ఏర్పాట్లు చేపట్టనుంది. 1,870 మంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారు.రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖకు చెందిన అధికారులతో 8 ఫ్లయింగ్ స్క్వాడ్లను, 20 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 164 మంది చీఫ్ సూపరింటిండెంట్లను, 164 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించనున్నారు.అన్ని కేంద్రాల్లో బెంచీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని కేంద్రాల్లో ప్రాథమిక వసతులు కల్పించనున్నాం. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల్లో గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

- కోట వెంకట నాగేంద్రకుమార్, డీఈవో

వ్యవసాయ బావిలో పడి కండక్టర్ మృతి

నారాయణవనం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావిలో పడి కండక్టర్ మృతిచెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చెందిన తులసి(50) తిరుమల డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం సొంత పనుల నిమిత్తం తిరుపతికి వెళ్లి వచ్చాడు. బహిర్భూమి నిమిత్తం మండల కాంప్లెక్స్ సముదాయం వద్ద బస్సు దిగాడు. సమీపంలోని పొలాల్లోకి వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుని బావిలోకి దిగే క్రమంలో అందులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో చనిపోయాడు. ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



తులసి (ఫైల్ ఫొటో)

మహా శివరాత్రి ఉత్సవాల కోసం రథాలకు మెరుగులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఉత్సవాల కోసం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఊరేగనున్న రథాలకు అధికారులు మెరుగులు దిద్దే పనులు చేపట్టారు. ముక్కంటి ఆలయ భిక్షాల గాలిగోపురం సమీపంలో స్వామి అమ్మవార్ల రథాలు ఉన్నాయి. వీటికి రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప రేకులను తొలగించారు. రథాల పటిష్టతను పరిష్కరించడంతో పాటు అవసరమైన మెరుగులు అద్దే పనులను ప్రారంభించారు.



ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

● ఇద్దరు డ్రైవర్ల అరెస్టు

రేణిగుంట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నది తీర ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కవేటర్‌ను గాజులమండ్యం పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని తండ్లం గ్రామ సమీపంలో శనివారం రాత్రి పోలీసులు రోజువారీ తనిఖీలు చేపట్టారు. స్వర్ణముఖి నది తీర ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తలిస్తుండటాన్ని గుర్తించి టిప్పర్‌ను, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే మండల పరిధిలోని తండ్లం, సూరప్పకశం పంచాయతీ పరిధిలో స్వర్ణముఖి నదిలో తీసిన ఇసుకను రహస్య ప్రదేశాల్లో డంప్ చేసుకుని రాత్రి సమయంలో ప్రైవేటు లారీల్లో తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోటకు తరలిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని చెబుతూ తెల్ల టిప్పర్లతో బహిరంగంగా బిల్డర్లకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



గాజులమండ్యం పోలీసుస్టేషన్‌కు తరలించిన టిప్పర్, ఎక్స్‌కవేటర్

త్వరలో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు

● ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మంగళం డిపో పరిధిలోకి త్వరలో 50 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. అలిపిరి డ్రైవర్స్ క్వార్టర్స్ వద్ద అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తున్న ఆర్టీసీ ఆస్పత్రిని శనివారం ఆయన సందర్శించారు. దాదాపు రూ. 6కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఈ భవనం ప్రస్తుతం గ్రౌండ్, ఫస్ట్‌ఫ్లోర్ పూర్తకాగా, సెకండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తయ్యాక ప్రారంభ ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్‌లో ప్రారంభోత్సవం చేసేలా చూడాలన్నారు. అనంతరం అలిపిరి డిపోలో ఎలక్ట్రిక్ బస్సు ఛార్జింగ్ స్టేషన్‌ను, బస్సులను పరిశీలించారు. డీఎంతో సమీక్షిస్తూ ఇప్పటికే వంద ఎలక్ట్రిక్ బస్సులు జిల్లాలో నడుస్తున్నాయన్నారు. త్వరలోనే 50ఎలక్ట్రిక్ బస్సులు తిరుపతికి రానున్నాయన్నారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని డీపీటీవో నరసింహులను ఆదేశించారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఈ చెన్నకేశవులు, డీఎంలు బాలాజీ, హరిబాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఈడీ చెంగల్‌రెడ్డి

బీసీ హాస్టల్స్‌లో వందశాతం ఫలితాలు రావాలి

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో బీసీ వసతిగృహాల్లో వందశాతం ఫలితాలు రావాలని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత సూచించారు. శనివారం తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. బీసీ వసతి వసతిగృహాలను నిత్యం పర్యవేక్షించాలని, విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేయాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. బీసీ వసతి గృహాల అభివృద్ధికి ప్రభుత్వం అందజేసే నిధులతో పాటు సీఎస్ఆర్, ఎంపీ నిధులు సేకరించాలని ఆదేశించారు. మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుందని, ఈ లోపు బీసీ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో స్వయం ఉపాధి పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అన్ని కులవృత్తుల వారికి సబ్సిడీతో కూడిన రుణాలు అందజేస్తున్నామన్నారు. జిల్లాలో చేనేత వస్త్రాల విక్రయాలకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. నేతన్నలకు 365 రోజులు పనులు కల్పించేలా వీవర్ శాలలు, చేనేత క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, జౌళి చేనేత శాఖ ఏడీ వరప్రసాద్, ఆప్కో జిల్లా మార్కెటింగ్ అధికారి కోటేశ్వరరావు, బీసీ జిల్లా సంక్షేమశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

సచివాలయాల్లో ధ్రువపత్రాల కొరత

మీసేవ కేంద్రాలకు లబ్ధిదారుల పరుగు - ఒక్కో పత్రంపై రూ.100 వరకు అదనపు భారం

(చిత్తూరు కలెక్టరేట్, ఆంధ్రజ్యోతి)

'పత్రాల కొరత ఉంది. దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేం. మీసేవ కేంద్రాలకు వెళ్ళండి'
- గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్ళిన లబ్ధిదారులకు అక్కడి ఉద్యోగుల ఉచిత సలహా.

'పత్రాలు లేవు... సర్వర్ పనిచేయడం లేదు... నాలుగు రోజుల తర్వాత రండి చూస్తాం
మరికొన్ని సచివాలయాల్లో ఉద్యోగుల నిర్లక్ష్యపుసమాధానం'

దీంతో చేసేదేం లేక లబ్ధిదారులు మీసేవ కేంద్రాలకు వెళ్ళి ఒక్కొక్కరు రూ.50 నుంచి రూ.100 వరకు వెచ్చించి దరఖాస్తు చేసుకుంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ధ్రువపత్రాల కొరత ఏర్పడింది. నవంబరు నెల నుంచి ఏజెన్సీ సరఫరా నిలిపివేయడంతో ఈ దుర్గతి ఏర్పడింది. వచ్చేవారంలో ఏజెన్సీ ద్వారా ప్రభుత్వం ధ్రువ పత్రాలను సరఫరా చేస్తుందని, అప్పటివరకు సర్దుబాటు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

ఇటీవల కూటమి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ, ఈబీసీ, కాపు, బలిజ, ఒంటరి తదితర కులాలకు



స్వయం ఉపాధి రాయితీ పథకాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. వాటికి దరఖాస్తు చేసుకోవాలంటే లబ్ధిదారులు తప్పనిసరిగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేయాలి. ప్రస్తుతం ఆ పత్రాలకు కొరత నెలకొనడంతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో 31 మండలాలుండగా, ఒక్కో మండలంలో 15 నుంచి 20కి పైగా గ్రామ సచివాలయాలు, మున్సిపాలిటీల్లో 50 నుంచి 70 వార్డు సచివాలయాలు ఉన్నాయి. కుల, ఆదాయ, 1బీ అడంగళ్, ఆర్ఓఆర్, జనన, మరణ ధ్రువీకరణ, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలకోసం సచివాలయాలకు ప్రజలు వెళ్తుంటారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో వున్న డీఎల్డీవో కార్యాలయం నుంచి మండలాలకు, మున్సిపాలిటీలకు ఇటీవల కొత్తగా మార్పుచేసిన హై సెక్యూరిటీ పత్రాలు ఇస్తారు. అక్కడికి సచివాలయ సిబ్బంది వెళ్ళి తెచ్చుకొని, దరఖాస్తుదారులకు ఇవ్వాల్సివుంటుంది.

● అంతా... అరకొరే...

గ్రామ, వార్డు సచివాలయాలకు కోరిన మేర పత్రాలు ఇవ్వడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. అవసరమైన చోట్ల ఇండెంట్ పెట్టడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి. అత్యవసరమైతే ఇరుగు, పొరుగున వున్న సచివాలయాలకు వెళ్ళి అరువుగా తెచ్చుకుని పంపిణీ చేయాల్సివస్తోంది. చాలాచోట్ల ధ్రువపత్రాలు అయిపోవడంతో దరఖాస్తుదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

కొరత లేదు

జిల్లాలో ధ్రువపత్రాల కొరత ఏమాత్రం లేదు. గ్రామ, వార్డు సచివాలయాలకు పత్రాలు కావాలంటే మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు కోరిన వెంటనే హై సెక్యూరిటీ పత్రాలు పంపేందుకు సిద్ధంగా ఉన్నాం. 25వేల పత్రాల స్టాకు ఉంది. ఇది కాకుండా దరఖాస్తుదారుల ఇబ్బందులను గుర్తించి మరో ఒక టిన్నర లక్షల ధ్రువపత్రాలు కావాలని ప్రభుత్వానికి ముందస్తుగా ఇండెంట్ పెట్టాం. ఎవరైనా ధ్రువపత్రాలు అందుబాటులో లేవని ఫిర్యాదు చేస్తే సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లపై కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు తీసుకుంటున్నారు.

- రవికుమార్,
గ్రామ, వార్డు సచివాలయాల
జిల్లా సమన్వయ అధికారి, చిత్తూరు.

ఢిల్లీలో బీజేపీ విజయంపై సంబరాలు



చిత్తూరులోని గాంధీ విగ్రహం ముందు సంబరాల్లో బీజేపీ నాయకులు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బీజేపీ విజయంపై నగరంలోని ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. గాంధీ విగ్రహం వద్ద బాణసంచా కాల్చారు. బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్‌నాయుడు, శ్రీనివాసులు, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, నాయకులు చిట్టిబాబు, షణ్ముగం, రవికుమార్, బాబు, రామభద్ర పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.25వేలివ్వాలి

● అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ



సమావేశానికి హాజరైన అంగన్వాడీ వర్కర్లు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తమకు కనీసం వేతనం రూ.25వేలు ఇవ్వాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు సీడీపీవో కార్యాలయం వద్ద జరిగిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. ఇక కేంద్ర బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులను కేటాయించకుండా నిర్వీర్యం చేసే ప్రయత్నాల్లో ఉన్నారని ఆరోపించారు.మినీ అంగన్వాడీలను మెయిన్ కేంద్రాలుగా గుర్తించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు.ప్రభుత్వం న్యాయంచేయకపోతే శాసనసభ సమావేశాల తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, ఇతర నేతలు పాల్గొన్నారు.

హోటల్ గ్రాండ్‌రిడ్జ్‌కు బాంబు బెదిరింపు

చెన్నై నుంచి మెయిల్ - ఉలిక్కిపడ్డ పర్యాటకులు
- అంతా ఉత్తిదే అని తేల్చిన పోలీసులు



హోటల్ గ్రాండ్‌రిడ్జ్‌లో బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

తిరుచానూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామం వద్ద ఉన్న హోటల్ గ్రాండ్ రిడ్జ్‌కు శనివారం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. హోటల్ నిర్వాహకులతో పాటు బస చేసిన పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. పోలీసులు తనిఖీలు చేసి, ఫేక్‌కాల్‌గా నిర్ధారించారు. అచ్చి ముత్తు సవుక్కు శంకర్ అనే మెయిల్ ఐడీ నుంచి 'మీ హోటల్‌లో ఆర్‌డీఎక్స్‌తో కూడిన బాంబును అమర్చి పేల్చివేస్తాం' అని శనివారం వేకువజామున 2 గంటలకు మెయిల్ వచ్చింది. హోటల్ సిబ్బంది మధ్యాహ్నం 1.30గంటల ప్రాంతంలో గుర్తించారు. సాయంత్రం తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాంబ్ స్క్వాడ్, స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తనిఖీలు చేశారు. చివరకు ఫేక్ కాల్‌గా నిర్ధారించారు. ఈ ఘటనతో తిరుచానూరులో కలకలం రేగింది.

రామకృష్ణతీర్థ ముక్కోటి ఏర్పాట్లపై సమీక్ష

తిరుమల, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 12న జరుగనున్న రామకృష్ణతీర్థ ముక్కోటి ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శనివారం తిరుమలోని గోకులం మీటింగ్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామకృష్ణతీర్థ ముక్కోటికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. యాత్రికుల కోసం రేడియో బ్రాడ్ కాస్టింగ్ ద్వారా ప్రకటనలు, డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భద్రతా సిబ్బంది, పోలీసులు సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్నప్రసాదం, తాగునీరు, వైద్య సదుపాయాలు, అటవీ శాఖల ఏర్పాట్లపై కూడా సమీక్షించారు. అధిక బరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న యాత్రికులను, వృద్ధులను, పదేళ్లలోపు చిన్నారులను అనుమతించబోమని స్పష్టం చేశారు. గోగర్భం డ్యాం నుంచి పాపవినాశనం వరకు యాత్రికులను తరలించేందుకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. 12వ తేదీ ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులకు అనుమతి ఉంటుందన్నారు. సమావేశంలో ఈఈ సుబ్రహ్మణ్యం, డీఎఫ్‌వో శ్రీనివాసులు, పోలీసులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సలహాదారు ఎంఏ షరీఫ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ముందుకెళుతోందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో సీఎం చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా షాదీఖానాలు, ఉర్దూ యూనివర్సిటీలు, పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. వివాహం చేసుకునే ముస్లిం మహిళలకు దుల్హన్ పథకం కింద రూ.లక్ష ఇచ్చి ప్రోత్సహించారని చెప్పారు. మసీదు భూముల్ని కాపాడి ముస్లింలకు వాటిపై హక్కు కల్పించిన ఘనత చంద్రబాబుదేనని ప్రశంసించారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి ముస్లింలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని మండిపడ్డారు. చిత్తూరులోని బాలికల గురుకుల పాఠశాలకు తన సొంత డబ్బుతో హీటర్లు, బెడ్‌షీట్లు ఇస్తామని చెప్పిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలు మరింత అభివృద్ధి చెందుతారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, సివిల్ సప్లయీస్ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్ తాజ్, నేతలు షేక్ ఉమర్, రాధా కృష్ణ, సప్తగిరి ప్రసాద్, మోహన్‌రాజ్, ఖాజా పీర్, ఫిరోజ్, అత్తాబాయ్, జిలాని, అన్సర్, జాఫర్, ఉస్మాన్, అక్బర్, రాజశేఖర్, చింటూ, రఘు, జైపాల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇస్తాం

ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు వెల్లువెత్తిన అర్జీలు



నగరి టీడీపీ కార్యాలయంలో వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛన్లు ఇస్తామని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ హామీ ఇచ్చారు. నగరి టీడీపీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చి అర్జీలను సమర్పించారు. అత్యధికంగా పెన్షన్ల కోసమే వినతులు అందాయి. అలాగే నగరి మండలం ఓజీకుప్పం పంచాయతీలోని కేజీకుప్పంలో తన భూములకు దారి సమస్య ఉందని ఓ రైతు విన్నవించారు. గుండ్రాజుకుప్పం దళితవాడలో డ్రైనేజీ సౌకర్యం లేదని అలెక్స్ తెలిపారు. పలు గ్రామాల్లో శ్మశానాలకు దారి ఏర్పాటు చేయాలని కోరారు. భూసమస్యలు, ఇంటి పట్టాలు, నూతన గృహాలు కావాలంటూ ఇంకొందరు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ రోడ్లు దాదాపు పూర్తయ్యాయని, కాలువల నిర్మాణం కూడా త్వరలో చేపట్టడం జరుగుతుందని చెప్పారు. సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రజలకు తెలియజేశారు. నగరి టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసన్, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజి, నాయకులు గుణశేఖర్, కృష్ణారెడ్డి,జ్యోతినాయుడు, నారాయణస్వామి నాయుడు, సురేష్‌నాయుడు,ఉమాపతి రాజు,అలెక్స్, అశోక్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో ఈతకెళ్లిన యువకుడి గల్లంతు





గాలింపు చర్యలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు - సెల్వకుమార్ (ఫైల్ ఫొటో)



రోదిస్తున్న సెల్వకుమార్ తల్లి, అక్క

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చెరువులో ఈతకెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండల పరిధిలోని శ్రీని ఫుడ్ పార్క్‌లో ఉన్న ఫోడ్రాన్ కంపెనీలో సెల్వకుమార్(27), ప్రశాంత్, శరవణన్, గోపీనాథ్ పనిచేస్తున్నారు. వీరంతా శుక్రవారం మధ్యాహ్నం తర్వాత మొగిలి సమీపంలోని గౌనిచెరువులో ఈత కొట్టడానికి వెళ్లారు. సాయంత్రం సమయంలో లోతు ఎక్కువగా ఉన్న ప్రదేశంలోకి సెల్వకుమార్ వెళ్లడంతో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు అతడిని బయటకు తీసుకురావడానికి ప్రయత్నించి, విఫలమయ్యారు. ఈ విషయాన్ని ఫోడ్రాన్ కంపెనీ ఇన్‌చార్జి గోపికి తెలియజేశారు. ఆయన మరికొంత మందిని తీసుకొచ్చి గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బంగారుపాళ్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే పలమనేరు అగ్నిమాపక అధికారులకు తెలియజేయగా.. వారు గజ ఈతగాళ్లతో చెరువు వద్దకొచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం సాయంత్రానికి కూడా మృతదేహం లభ్యం కాలేదు.

శోకసంద్రంలో కుటుంబీకులు

సెల్వకుమార్ గల్లంతైన విషయం తెలుసుకున్న ఆయన తల్లి, అక్క చెరువు వద్దకు చేరుకున్నారు. కుటుంబాన్ని పోషించడం కోసం తమిళనాడు రాష్ట్రం నామక్కళ్ నుంచి ఇక్కడికొస్తే.. ఇలా జరిగిందని వారు బోరున విలపించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

● పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ అన్నారు. శనివారం చిత్తూరులోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి 386 మందికిపైగా వచ్చిన తమ వినతులను ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రధానంగా ప్రభుత్వ పథకాల అమలు, ఆస్పత్రి వైద్య ఖర్చుల కోసం, శ్మశాన వాటిక దారి సమస్య, ఆర్థిక సాయం, ఉపాధి అవకాశాలు, భూవివాదాలు వంటి సమస్యలు ఉన్నాయి. పొలకల గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఉపసర్పంచ్ బత్తల సురేంద్రనాయుడు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రతి శనివారం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజాదర్బార్ ద్వారా గుర్తించే సమస్యలు పరిష్కరించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు.

50 శాతం సబ్సిడీపై మామిడి పండ్ల కవర్లు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మామిడి పిందె దశలో కాపాడుకునేందుకు 50 శాతం సబ్సిడీతో మామిడి పండ్ల కవర్లు రైతులకు ఇవ్వనున్నట్లు ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దిగుబడి వచ్చే సమయంలో ఆశించే ఈగ, ఇతర తెగుళ్ల నుంచి మామిడి పండ్లను కాపాడుకునేందుకు ఈ కవర్లు ఉపయోగపడతాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగినులకు ప్రత్యేక వసతులు కల్పించాలి : ఎస్టీయూ



జాతీయ వర్క్‌షాప్‌లో పాల్గొన్న సంఘం జాతీయ నాయకులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాఠశాల, కళాశాల బాలికలకు ప్రత్యేక వసతులు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ)జాతీయ మహిళా నాయకులు కోరారు. ఎస్టీయూ మహిళా నాయకుల జాతీయ వర్క్‌షాప్ స్థానిక బైరాగిపట్టెడలోని ఎస్టీయూ భవన్‌లో శనివారం జరిగింది. వివిధ రాష్ట్రాల మహిళా నాయకులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా ప్రతినిధులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు వీరమణి మాట్లాడుతూ... ఇంటర్ అనంతరం బాలికలు ఉన్నత విద్యకు వెళ్లడంలేదన్నారు. బాలికల ఉన్నత విద్య అభ్యసించేలా పభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులు ఉన్న కార్యాలయాలు, కళాశాలలు, యూనివర్సిటీలలో శిశు సంరక్షణ కేంద్రాలను, బేబీ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, పిల్లల వయసుతో సంబంధం లేకుండా శిశు సంరక్షణ సెలవులను సర్వీసులో ఎప్పుడైనా వినియోగించుకునేలా జీఓ జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా నాయకులు రేణుకాదేవి, శ్రీదేవి, ద్రాక్షాయణి, జ్యోతి, రమాదేవి, రమ్య, అనిత, జయంతి, జయసుధ, సరిత, ప్రవీణ కుమారి, విశాల, పుష్పలత, ఏఎస్‌టీఎఫ్ వర్కింగ్ ప్రసిడెంట్ కత్తి నర్సింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు తగ్గుముఖం

సోమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. శనివారం సోమల వారపు సంతలో యర్రగడ్డలు కిలో రూ. 35, చిన్న ఎర్రగడ్డలు రూ. 40 పలికాయి. మిరపకాయలు కిలో రూ.40, వంకాయలు రూ.20 బీన్స్ రూ.30, బెండకాయలు రూ.20, కాకరకాయలు రూ.30, అలసంద కాయలు రూ.20, మొటిక కాయలు రూ.30, బీరకాయలు రూ. 30, ముల్లంగి రూ.10, క్యాలీఫ్లవర్ రూ. 10, టమోటా రూ.30 పలికాయి. అనపకాయలు కిలో రూ. 100 నుంచి రూ. 40కి తగ్గగా మునక్కాయలు కిలో రూ.120 నుంచి రూ. 90కి తగ్గాయి. ఆకు కూరల కట్ట రూ.10 మాత్రమే పలకడంతో రైతుల్లో నిరాశ నెలకొంది.

ఉచితంగా కంటి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కుప్పం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని పీఈఎస్ అర్బన్ సెంటర్‌లో శనివారం కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. దీర్ఘకాలిక కంటి సమస్యలతో బాధపడుతున్న సుమారు వందమంది ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేసుకున్నారు. వీరిలో 15 మందిని ఉచిత కంటి ఆపరేషన్ల కోసం పీఈఎస్ ఆసుపత్రికి సిఫార్సు చేసినట్లు లయన్స్ క్లబ్ సలహాదారు ఎ.మహేశ్ తెలిపారు. వైద్య సిబ్బందితోపాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు జీఎస్.రమేశ్, పీజీ.సెల్వం, మధుసూదన్, కృష్ణమూర్తి, నాగరాజ్, శివ ప్రసాద్, ఏకాంబరం, ధనశేఖర్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలలో న్యాయం చేయాలి



రాజ్‌కుమార్‌ను కలిసిన నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు

కుప్పం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రుణాలు, పించన్లలో అన్యాయం జరగకుండా సమస్యలు పరిష్కరించాలని నాయీ బ్రాహ్మణులు కోరారు. నాయీ బ్రాహ్మణుల ప్రతినిధులు కుప్పంలో శనివారం టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌ను కలిశారు. బీసీ కార్పొరేషన్ రుణాలు, పక్కా ఇళ్లు, పింఛన్ వంటి ప్రయోజకాల ఎంపికలో వెనుకబడిన తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని కోరారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రాజ్‌కుమార్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కుల సంఘం సభ్యులు హరి, జ్యోతీశ్, మణి, దేవా, గిరి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వసనాడు మసీదు రోడ్డుకు రూ.10 లక్షలు మంజూరు



దువా చేస్తున్న ప్రేమ్‌కుమార్, ముస్లింలు

కుప్పం రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వసనాడు మసీదు రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో ముస్లిం కల నేరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చల్లగా ఉండాలని కోరుకుంటూ వసనాడు మసీదు వద్ద ముస్లింలతో కలిసి ప్రేమ్‌కుమార్ దువా చేశారు. కార్యక్రమంలో పటేల్ సాహెబ్, ముతేలి అమీర్, శరవణ, చరణ్, సుబ్బు, శివ, రియాజ్, సిమెంట్ బాబు, వళ్లియప్ప, మహేంద్ర పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



ఉపాధ్యాయులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందిస్తున్న వైద్యులు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మండల వైద్యాధికారి డాక్టర్ దినేష్‌కుమార్, డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో శనివారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలో 3,900 మంది 1-19 వయస్సు కలిగిన పిల్లలు ఉన్నారని.. వీరికి ఈనెల 10న అందిస్తారని తెలిపారు. 1- 2 సంవత్సరాల వయస్సు వారికి అర్ధ, 19 ఏళ్ల లోపు వారికి ఒక్క మాత్ర వేయాలని సూచించారు.

వైద్యుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు



డాక్టర్ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న షావ్యశ్రీ

చౌడేపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం వస్తే డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చిన్నకొండామరికి చెందిన షావ్యశ్రీ డాక్టర్ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం చిన్నకొండామరికి చెందిన షావ్యశ్రీ ఆరోగ్యం బాగలేదని స్థానిక పీహెచ్‌సీకి వెళ్లారు. డాక్టర్ పూజ గదికి వెళ్లగానే పక్కనే మరో డాక్టర్ నవీన్ సెల్‌ఫోన్‌లో ఎక్కువ సౌండ్ పెట్టుకుని యూట్యూబ్ చూస్తున్నారు. సౌండ్ తగ్గించాలని కోరడంతో డాక్టర్లు పూజ, నవీన్ ఆమెను అసభ్యంగా తిట్టి బయటకు పొమ్మని దుర్భాషలాడారని షావ్యశ్రీ తెలిపారు. జిల్లా వైద్యాధికారులు స్పందించి రోగులకు సక్రమంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కనులవండువగా లక్ష్మీ నరసింహుడి కల్యాణోత్సవం



కల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం కనులపండువగా స్వామివారి కల్యాణోత్సవం వేడుకలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం వేడుకల్లో భాగంగా గోపూజ, విశ్వక్సేనపూజ, అభిషేకం, అలంకరణ, హోమం పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం స్వామివారి ప్రాకార ఉత్సవం, తీర్థప్రసాదాల వినియోగం నిర్వహించారు.

జ్ఞానమల్లేశ్వరస్వామి ఆలయంలో..



● సదుం: మండలంలోని నడిగడ్డ గ్రామం మురళీకొండ సమీపంలోని జ్ఞానమల్లేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం శనివారం కనులపండువగా నిర్వహించారు. ఉభయదారులుగా సురేశ్‌రెడ్డి, భారతి దంపతులు వ్యవహరించారు. రమణ దీక్షితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యతోపాటు క్రీడలూ అవసరం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు అవసరమని సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక భాష్యం పాఠశాల ఆవరణలో పుంగనూరు, మదనపల్లె, తిరుపతి, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాల భాష్యం పాఠశాల విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రీడల్లో దేశస్థాయిలో పుంగనూరుకు ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆ స్థానాన్ని విద్యార్థులు నిలపడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, తిరుపతి, శ్రీకాళహస్తి, మదనపల్లె పాఠశాలల హెచ్‌ఎంలు అంజనేయులు, శ్రీనివాసులు, నేతాజీ, దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పంచలోహ కవచం



ఆలయంలో ద్వారాలకు పంచలోహ కవచం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని బాటగంగమ్మ ఆలయంలో దాతల సహకారంతో గర్భగుడి ద్వారబంధానికి పంచలోహ కవచం ఏర్పాటుచేశారు. దాదాపు రూ.2 లక్షలతో ఏర్పాటుచేసిన పంచలోహ తాపడం ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఆలయాభివృద్ధికి సహకారమందిస్తున్న పలువురు దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో అభిషేక పూజలు

సోమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేసి అభిషేక పూజలు చేశారు. ఉభయదారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్, పెద్దఉప్పరపల్లె పశువైద్యాధికారి చందనప్రియ తదితరులు పాల్గొన్నారు.



● రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లెలో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ఉదయం అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా సత్యసాయి శత జయంతి

చౌడేపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను స్థానిక సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం భజన మండలి సభ్యులు సుజాత, బాల వికాస్ గురువు హేమలత, నరేష్ ఆధ్వర్యంలో చౌడేపల్లె నుంచి పుట్టపర్తికి సాయి భక్తుల భజన బృందం సభ్యులు బయలుదేరి వెళ్లారు.

నేడు రామకుప్పంలో ఉచిత వైద్యశిబిరం

రామకుప్పం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్‌ఆర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, రామకుప్పం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు సీతాపతి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యులచే పరీక్షించి ఉచితంగా మందుల పంపిణీ చేస్తారన్నారు. శిబిరంలో ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేస్తారని ఆయన తెలిపారు.

డిజిటల్ గుర్తింపు కార్డులు తీసుకోవాలి

రామకుప్పం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని రైతులు విధిగా డిజిటల్ గుర్తింపు (రైతు విశిష్ట సంఖ్య) కార్డులను పొందాలని మండల వ్యవసాయాధికారి అమృత కోరారు. డిజిటల్ గుర్తింపు కార్డులుంటేనే రైతులకు పంటలబీమా, పీఎం కిసాన్ యోజన, పంటనష్ట పరిహారం, వ్యవసాయ యంత్ర పరికరాలపై రాయితీలు, ఇతర ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందగల్గుతారన్నారు. రైతులు ఈనెల 28లోపు సమీప రైతు సేవాకేంద్రాల్లో ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌లింక్ అయిన ఫోన్‌నంబర్‌తో గ్రామ వ్యవసాయ సహాయకుల నుంచి డిజిటల్ కార్డులు పొందాలని ఆమె కోరారు.

రాజనాలబండలో ప్రత్యేక పూజలు



అలంకరణలో ఆంజనేయస్వామి

చౌడేపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే కొండపై స్వయంభుగా వెలసిన లక్ష్మీ నరసింహస్వామికి, రాజనాలబండపై వెలసిన ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు చేశారు. స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

నేడు కొల్లావారిపల్లెలో మైలేరు పండుగ

సోమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లె పంచాయతీ కొల్లావారిపల్లెలో మైలేరు పండుగ సందర్భంగా 9న ఆదివారం పశువులకు పరుగుల పోటీలు నిర్వహించనున్నారు. పరుగు పందెంలో పాల్గొనే గిత్తలకు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించాలని నిర్వాహకులు తెలిపారు. పరుగు పందెంలో విజేత కోడిగిత్తలకు విలువైన బహుమతులు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. సోమ, మంగళవారం నల్లాపురమ్మ జాతర వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు.

కనిపించని పూత..!

● మామిడికి పొగమంచు దెబ్బ ● ఈసారీ తగ్గనున్న దిగుబడులు ● ఆందోళనలో రైతులు

వాతావరణ ప్రభావంతో పూత ఆలస్యం



వాతావరణ పరిస్థితుల ప్రభావంతో మామిడిలో పూత రావడం జాప్యం ఆలస్యమవుతోంది. భూమిలో వేడి, ఎండలు అధికంగా ఉంటేనే పూత రావడం జరుగుతుంది. గత ఏడాది ఒక ఎకరాకు నాలుగు టన్నులు కాయలు దిగుబడి రావాల్సి ఉండగా.. ఎకరాకు టన్ను కాయలు దిగుబడి వచ్చాయి. ఈ ఏడాది రాబోయే పూతను బట్టి దిగుబడులు నిర్ధారణ చేయొచ్చు. ఇప్పుడిప్పుడే పూత వస్తోంది. కార్బానిజం, వేప నూనె తగు మోతాలో కాండం, కొమ్మలు బాగా తడిచేలా చేస్తే పూత వస్తుంది.

\- సంతోషి కుమారి, ఉద్యాన అధికారి, చౌడేపల్లె



పూత లేకుండా దర్శనమిస్తున్న మామిడి చెట్లు

సోమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది మాదిలాగే ఈ ఏడాదీ ప్రకృతి మామిడి రైతుపై కన్నెర్ర చేస్తోంది. సకాలంలో పూత రాకపోగా ఈసారీ దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళనలో పడ్డారు. సాధారణంగా డిసెంబరు, జనవరి నెలల్లో మామిడి పూత వస్తుంది. డిసెంబరులో అరకొరగా వచ్చినా జనవరిలో పూర్తి స్థాయికి వచ్చి ఫిబ్రవరి నుంచి మార్చి నాటికి పిందెలు ఏర్పడుతాయి. ఏప్రిల్ నుంచి మామిడి కాయలు కాపు కాస్తాయి. అయితే ఈ ఏడాది జనవరికి పూతే కనిపించలేదు. పొగ మంచు తీవ్రంగా ఉండటం.. ఉదయం వరకు మంచు కురవడం శాపంగా మారింది. దీంతో రైతులు పూత కోసం విపరీతంగా మందుల పిచికారీ చేస్తున్నారు. పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లె మండలంలో 5 వేలు ఎకరాలు, పుంగనూరు మండలంలో 4 వేలు, సోమలలో 12 వేలు , సదుంలో 8 వేలు, పులిచెర్లలో 15 వేలు ఎకరాలు, రొంపిచెర్లలో 5 వేల ఎకరాల్లో రైతులు మామాడి సాగు చేపడుతున్నారు. అయితే ఫిబ్రవరిలోనూ 40 శాతం పూత కనబడుతుంది. సోమల , పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె, నెల్లిమంద, చిన్నఉప్పరపల్లె ప్రాంతాల్లో అత్యంత ఎక్కువగా మామిడి ఉంది. బేనిషా, మల్లికా, తోతాపురి, నీలం రకాల తోటలు ఉన్నాయి. సోమల మామిడి మార్కెట్ నుంచి ముంబాయి, ఢిల్లీ, గుజరాత్, కలకత్తా ప్రధాన నగరాలకు మామిడి ఎగుమతి అవుతోంది. రోజూ ఇతర ప్రాంతాలకు ఎగుమతులు అవుతూ ఆగస్టు వరకు మామిడి మార్కెట్‌లో పలువురికి ఉపాధి కలుగుతుంది. అయితే మామిడి పంటకు ప్రకృతి సహకరించకపోవడంతో భారీ ఎత్తున దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఈసారీ దిగుబడులు ఉండవనే ముందు చూపుతో వ్యాపారులు తోటలు లీజుకు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట బాగా పండితే గిట్టుబాటు ధర లేకపోవడం, ధరలు ఉన్నప్పుడు పంటల్లో దిగుబడులు రాకపోవడం వంటి కారణాలతో ఏటా మామిడి రైతులు భారీగా నష్టపోతున్నారు. చేసేది లేక కొందరు మామిడి రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎండలు కాస్తేనే పూత ఆశాజనకంగా వచ్చే అవకాశం ఉంది. గత ఏడాది డిసెంబరు నుంచి పొగ మంచు ప్రభావంతో పూత రావడం లేదని రైతులు వాపోతున్నారు.

తోటల్లో ట్రాక్టర్‌తో దుక్కులు, మందుల పిచికారికే అధిక వ్యయం చేయడంతో పెట్టుబడులు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదని రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దీంతో పాటు మామిడి తోటలకు బీమా ప్రీమియం చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటనలు చేసినా రైతులు ప్రీమియం చెల్లించడానికి ఉత్సాహం చూపలేకపోయారు. వేలమంది మామిడి రైతులున్నా నియోజకవర్గంలోనే 120 మంది మాత్రమే ప్రీమియం చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఎకరాకు రూ.1,750 బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉండగా.. రైతులు చెల్లించలేక పోయారు.

తలకు మించిన భారంగా ఖర్చులు



నాకున్న 5 ఎకరాల మామిడి తోటకు ఖర్చులు ఏటా తలకు మించిన భారంగా మారాయి. సేద్యపు ఖర్చు, మందుల పిచికారీ ఖర్చులు పెరిగిపోయాయి. దిగుబడి మాత్రం రాలేదు. ఈ ఏడాది మంచు ప్రభావంతో పూతే కనిపించడం లేదు . గత ఏడాది దిగుబడులు తక్కువే. ఈసారీ అదే పరిస్థితి నెలకొంటోంది. మామిడి సాగుపై నమ్మకాలు పోతున్నాయి.

\- పోకల రామచంద్ర, రైతు, సూరయ్యగారిపల్లె

పొగమంచుతో పూత రాలిపోతోంది..



ఎకరాకు 70 మామిడి చెట్లు ఉంటే 10 చెట్లులోనూ పూత కనిపించడం లేదు. మందులు పిచికారీ చేశాం. ఇప్పుడు కురుస్తున్న పొగ మంచుతో వచ్చిన పూత నల్లగా మారి రాలిపోతుంది. ఉద్యాన అధికారుల సూచనలతో పొటాషియం నైట్రేట్, పార్ములా -4 పిచికారీ చేశు. ఇంకా దాని ప్రభావం కనబడలేదు.

\- పగడాల లక్ష్మీపతి, రైతు, కందూరు



పలమనేరులో శనివారం గౌరవ వందనం స్వీకరిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకట నారాయణభట్



ప్రారంభోత్సవంలో పాల్గొన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకట నారాయణభట్



పలమనేరుకు చేరుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



పలమనేరులో కోర్టు భవన సముదాయాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

బీజేపీతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు



పుంగనూరులో బీజేపీ సంబరాలు

కుప్పం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు సిద్ధిస్తుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్.తులసీనాథ్ అన్నారు. ఢిల్లీలో జరిగిన బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో కుప్పంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నాయి. బీజేపీ కుప్పం అర్బన్ అధ్యక్షుడు నితీశ్, కుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాల అధ్యక్షులుఉ వడివేలు, గజేంద్ర, రామచంద్రుడు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కాశీనాథ్, ఓబీసీ నాయకుడు శ్రీధర్, ముత్తువేలు, జనసేన కుప్పం ఇన్‌చార్జి నరేశ్ పాల్గొన్నారు.

● పుంగనూరు: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై శనివారం పుంగనూరులో బీజేపీ నాయకులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. అయూబ్‌ఖాన్, నరసింహులు, ప్రసాద్, నానబాల కుమార్, కుట్టి పాల్గొన్నారు.

● సోమల: బీజేపీ పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ గన్నా మదన్‌మోహన్‌బాబు ఆధ్వర్యంలో సోమలలో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు హేమగిరి, సూరిశెట్టి నాగభూషణం రాయల్, మురళీ, ప్రసాద్, శీలం రామూర్తి, నరేంద్రగుప్తా, జయప్రకాశ్, యుగంధర్, రాజన్న పాల్గొన్నారు.

●రామకుప్పం: రామకుప్పంలో బీజేపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజసింహా, ఆంజనేయులు, కమలనాథరెడ్డి, మురళీఆచారి. నాగరాజు, బీఎంకుమార్, జనార్ధన్‌రెడ్డి, గోవిందప్ప, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు వెంకటేగౌడ హాజరు

పలమనేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో శనివారం పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై సంతకాలు పెట్టారు. ఎన్నికల అనంతరం ఆయనపై నమోదైన కేసులకు సంబంధించి ఆయన హైకోర్టులో ముందస్తు బెయిల్ పొందారు. హైకోర్టు సూచన మేరకు ఆయన పలమనేరు పోలీసు స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లారు. ఆయనతో పాటు పలువురు వైసీపీ నాయకులు పోలీసు స్టేషన్‌కు వచ్చారు.

10న జాతీయ నులిపురుగుల నివారణ దివం

సోమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కందూరు, పెద్దఉప్పరపల్లె వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ బాలాజీ, డాక్టర్ నీలిమా కోరారు. శనివారం సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తమ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మధ్యాహ్న భోజనాంతరం పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని తెలిపారు.

నేడు కళామందిరంలో గురువందనం

పలమనేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని కళామందిరంలో ఈనెల 9న ఆదివారం గురువందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథంనాయుడు తెలిపారు. గురువు ప్రాముఖ్యత నాడు-నేడు అనే అంశంపై చర్చా కార్యక్రమంతోపాటు గురువులను సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

● ముగ్గురికి స్వల్ప గాయాలు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం సాయంత్రం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో కేజీ సత్రం వద్ద బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు ముందు వెళుతున్న ఆటోను వెనుక నుంచి ఢీకొంది. యాదమరికి చెందిన పెరిదాసు, సలాం, సురేష్‌లకు స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

శ్రీనివాసుడి ప్రతిరూపం.. నలగుండ్రాయస్వామి



కడపనత్తంలోని నలగుండ్రాయస్వామి ఆలయం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండలంలోని కడపనత్తం గ్రామంలో వెలసిన నలగుండ్రాయస్వామి ఆలయం ఘనచరిత్ర కలిగి విశేష ప్రాచుర్యం పొందింది. తిరుమల వేంకటేశ్వరస్వామి మొదట తిరగాడిన పవిత్ర స్థలంగా పేర్కొనబడుతున్న ఈ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. తిరుమల శ్రీనివాసుని సాక్షాత్తు ప్రతిరూపమే ఇక్కడ శిలారూపంగా స్వామివారు వెలిశారని చెబుతుంటారు. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో ఈ ఆలయం నిర్మించబడింది. మొదట శ్రీనివాసుడు ఇక్కడ పుట్టలో వుండగా రోజూ ఓ ఆవు పశువుల కాపరికి తెలియకుండా పుట్ట వద్దకు వచ్చి పాలు ఇవ్వడం గమనించిన ఆ కాపరి ఆవును కర్ర తీసుకుని కొడుతాడు. ఈక్రమంలో పుట్టలోని వేంకటేశ్వరస్వామికి తగిలి కుడిచెంప దెబ్బతగిలి పుట్ట ఆకారంగా ఏర్పడిన నల్లని శిలారూపమే నేడు నలగుండ్రాయస్వామిగా కొలుస్తున్నారు. రోజూ ఆవు వెళ్లి వచ్చే సొరంగ మార్గం కడపనత్తం నుంచి నెల్లిపట్ల కొండవరకు ఉన్నట్లు ఇప్పటికీ చెబుతుంటారు. కడపనత్తంలోని నలగుండ్రాయస్వామికి తిరుమలలో కంటే ఎక్కువగా ఉత్సవ విగ్రహాలు ఉండటం విశేషం. స్వామివారి విగ్రహం భిన్నస్వరూపంలో ఉంది. గర్భగుడి లోపల గతంలో ఉండిన సొరంగమార్గంలో కోడి పుంజుని వదిలితే నెల్లిపట్ల వద్దవున్న కొండకు వెళ్లి కూతవేసేదని అంటుంటారు. బ్రిటిష్‌వారి హయాంలో కడపనత్తం గ్రామం తాలూకా కేంద్రంగా ఉండి నార్త్‌ఆర్కాట్ జిల్లాలో కలిసి ఉండేది. బ్రిటిష్‌వారి పాలన ముగిసిన అనంతరం కడపనత్తం గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాలవారు ఆలయాభివృద్ధికి కృషి చేసి దాతల సహకారంతో ఏటా బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం చేయూతనందించి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం

టీడీపీ శ్రేణులకు నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ పిలుపు



నెట్టేరిలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

నింద్ర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అందరం కలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని టీడీపీ శ్రేణులకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. శనివారం నెట్టేరి క్రాస్ వద్ద నింద్ర మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి జరగక ప్రజలు ఇబ్బంది పడ్డారని గుర్తుచేశారు. అందువల్ల గ్రామాల్లోని సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని చెప్పారు. అందరికీ తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ప్రస్తుతం నియోజకవర్గ స్థాయిలో రూ.50 కోట్లతో సిమెంటు రోడ్లు నిర్మించామని చెప్పారు. ఇంకా కూడా మూడు మండలాల్లో రూ.15 కోట్లకు రోడ్లు నిర్మించనున్నట్లు వివరించారు. ఇక కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ముందుకెళితే పార్టీ కూడా అభివృద్ధి చెందుతుందని సూచించారు. శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరావు, బీసీ సెల్ నాయకులు బాబు యాదవ్, నాయకులు రవినాయుడు, భాస్కర్ రెడ్డి, వెంకటేశులు నాయుడు, తంగరాజ్, రమేష్, చిట్టిబాబు నాయుడు, మురళీనాయుడు, రవికుమార్, మనోజ్ యాదవ్, గాలి రమేష్ నాయుడు, నంద, గిరి, ఓంప్రకాష్, తేజేష్, జగన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో చదవండి

టెన్త్ విద్యార్థులకు టీచర్ల సూచన



విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయులు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పక్కా ప్రణాళికతో చదివితే పాసవ్వడం చాలా సులువుగా ఉంటుందని టెన్త్ విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు సూచించారు. వసతి గృహాల్లోని టెన్త్ విద్యార్థులకు నగరంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో శనివారం టీచర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు షంశీర్‌ఖాన్, అరుణశివప్రసాద్, జయకుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికే వసతి గృహ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారని, వాటిని పూర్తిగా అభ్యసనం చేస్తే అందరూ పాసవుతారన్నారు. ఏఎస్‌డబ్ల్యూవోలు నాగేశ్వరరావు, షకీలా, వార్డెన్లు, చిత్తూరు, జీడీనెల్లూరు, గుడిపాల, పూతలపట్టు, పెనుమూరు మండలాల విద్యార్థులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞావంతుడు మొగిలయ్యశెట్టి

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కళాకారుడు, సాహితీవేత్త, విశ్రాంత లెక్చరర్ మొగిలయ్యశెట్టి బముముఖ ప్రజ్ఞావంతుడని.. ఆయన మృతి సాహితి సాంస్కృతిక రంగాలకు తీరని లోటని ప్రముఖ సాహితీవేత్త హరినాయుడు అన్నారు. శనివారం విజయం విద్యాసంస్థల్లో హరివిల్లు లలిత కళా వేదిక, వరసిద్ధి కళాక్షేత్రం, జిల్లా రచయితల సంఘం, మన సంస్కృతి సంస్థల ఆధ్వర్యంలో మొగిలయ్యశెట్టి సంస్మరణ సభ జరిగింది. హరివిల్లు, మన సంస్కృతి నిర్వాహకులు మునుస్వామి, సహదేవ నాయుడు, జిల్లా రచయితల సంఘం సభ్యురాలు అరుణకుమారి మాట్లాడుతూ.. మొగిలయ్యశెట్టి నాటక రంగానికి ఎంతో కృషి చేశారన్నారు. జానపద కళలపై ఎంతో అవగాహన ఉండేదని, రచయితగానూ పేరు పొందారని తెలిపారు. ప్రముఖ సామాజిక కార్యకర్త పార్థసారధి నాయుడు, రచయిత్రి శ్యామలాదేవి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న హరినాయుడు

ఆటోను ఢీకొన్న కారు

● ముగ్గురికి స్వల్ప గాయాలు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం సాయంత్రం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో కేజీ సత్రం వద్ద బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు ముందు వెళుతున్న ఆటోను వెనుక నుంచి ఢీకొంది. యాదమరికి చెందిన పెరిదాసు, సలాం, సురేష్‌లు స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అమ్మఒడి'కి అనాథ వృద్ధుడి తరలింపు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె ఫ్లైఓవర్ వద్ద కొన్ని నెలలుగా ఉన్న అనాథ వృద్ధుడిని చిత్తూరుకు చెందిన అమ్మఒడి ఆశ్రమం అక్కున చేర్చుకుంది. స్థానిక నాయకులు లోకనాథ నాయుడు, హేమచంద్రనాయుడులు ఆశ్రమ నిర్వాహకుడు పద్మనాభనాయుడికి శనివారం సమాచారం ఇచ్చారు. ఆయన తన సిబ్బందితో వచ్చి వృద్ధుడికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రమేష్, టిప్పా ప్రకాష్, చండీ ప్రభ, హుస్సేన్, వాసు, దేవా, జరీనా, ఉదయ్, సమీర్, షబ్బీర్, సోము పాల్గొన్నారు.

వన వేణుగోపాలుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాబిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ వితరణతో ఆలయానికి తాగునీటి సదుపాయం కల్పించారు.

గుదిబండగా మారిన గోదాములు

ఏడాదిగా నిరుపయోగంగా ఉన్న మల్టీ సర్వీస్ సెంటర్ గోడౌన్లు

నాబార్డు ఇచ్చిన రూ.2కోట్ల అప్పు ఎలా తీర్చాలి?

తలలు పట్టుకుంటున్న జీడీనెల్లూరు సింగిల్‌విండో అధికారులు



ఎట్టేరికి సమీపంలో నిర్మించిన మల్టీ సర్వీస్ సెంటర్ గోడౌన్



నాగూరుపల్లె వద్ద..

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మల్టీసర్వీస్ సెంటర్ గోడౌన్లు (గోదాములు) గంగాధరనెల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాని (సింగిల్‌విండో)కి గుదిబండగా మారాయి. వైసీపీ హయాంలో ప్రతి మండలంలో రైతు భరోసా కేంద్రాలకు అనుసంధానంగా ఉండేలా నాబార్డు సహకారంతో ఈ గోదాములను నిర్మించారు. స్థానిక రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర లేనప్పుడు ఈ గోదాముల్లో నిల్వ ఉంచుకోవచ్చు. సరైన ధర వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చు. ఈ గోదాములో పంటను నిల్వ ఉంచినందుకు కొంత మొత్తాన్ని సింగిల్‌విండో అధికారులకు రైతులు చెల్లించాలని నిర్ణయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ గోదాములను రైతులెవరూ ఉపయోగించుకోకపోవడం వల్లే సమస్య తలెత్తింది. ఎందుకంటే మండలంలోని రామానాయుడుపల్లె, నాగూరుపల్లె, అంబోధరపల్లెకు సమీపంలో, ఎట్టేరికి సమీపంలో, తూగుండ్రంలో కొత్త సచివాలయం భవనానికి సమీపంలో ఒక్కొక్కటి రూ.40లక్షలతో ఐదు గోడౌన్లను 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో నిర్మించారు. ఇందుకోసం సింగిల్‌విండోకు రూ.2కోట్లను నాబార్డు అప్పుగా ఇచ్చింది. ఇప్పుడా అప్పును సింగిల్‌విండో ద్వారా అసలు, వడ్డీతో కలిపి కట్టించాలని డీసీసీబీపై ఒత్తిడి చేసినట్లు సమాచారం. దాదాపు ఏడాదిగా గోదాములు నిరుపయోగంగా ఉంటే నాబార్డు ఇచ్చిన అప్పును ఎలా తీర్చాలని సింగిల్‌విండో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

చెస్ పోటీలు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

చిత్తూరు క్రీడలు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మురగానిపల్లెలో ఉన్న న్యూయార్క్ పాఠశాలలో ఏపీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 140 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్ఆర్ ద్వారక, వర్షిణి, విక్రాన్త్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి బహుమతులను ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్, పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ లీలాకుమారి ప్రదానం చేశారు.

ఢిల్లీలో బీజేపీ గెలుపుతో వాడవాడలా సంబరాలు

నగరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):ఢిల్లీలో బీజేపీ విజయంపై ఆ పార్టీ శ్రేణులు శనివారం సాయంత్రం నగరి పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నాయి. మోదీకి, అమిత్‌షాకు, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు అనుకూలంగా నినాదాలు చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రమేష్‌నాయుడు, నగరి అధ్యక్షుడు హరి, నాయకులు రామ్మూర్తియాదవ్, వేలాయుధం, మండల, రూరల్ అధ్యక్షులు హరి, సతీష్‌కుమార్, టీడీపీ నాయకులు రమేష్‌బాబు, గుణశేఖర్, కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, జనసేన నాయకురాలు కోమల పాల్గొన్నారు.



నగరిలో స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

గంగాధరనెల్లూరు: బస్టాప్ కూడలిలో జరిగిన సంబరాల్లో ఓబీసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఇడగట్టి సుధాకర్, మండల బీజేపీ అధ్యక్షుడు ఆనంద్‌బాబు, నేతలు రాజేంద్ర, గుణశేఖర్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: మండల కేంద్రంలో జరిగిన సంబరాల్లో మండల బీజేపీ అధ్యక్షురాలు రమాదేవి, మాజీ మండల అధ్యక్షుడు స్వామినాథ్ గౌడ్, నాయకులు కోట చిట్టిబాబు, సుభాష్, గోపి, దేవ, సాయి, ప్రతాప్, చంద్ర, శేఖర్, నంది మాధవ్, ధనపండు, ఆనంద్, గోపి శరవణ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు గదిలో సచివాలయం

ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, ప్రజలు



వెదురుకుప్పం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం గ్రామ సచివాలయాన్ని ద్రౌపది అమ్మవారి ఆలయం సమీపంలోని ఓ ఇరుకు గదిలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉద్యోగులందరూ కూర్చోవడానికి వీలుగా వసతులు లేవు. ప్రజలు అధిక సంఖ్యలో వస్తే మరింత ఇబ్బందే. అన్ని వసతులతో కూడిన భవనంలోకి సచివాలయాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

రోబోటిక్స్ పోటీల్లో 'బృందావన్' ప్రతిభ



చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై విట్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ స్థాయి రోబోటిక్స్ పోటీల్లో బృందావన్ విద్యార్థులు సత్తా చాటినట్లు కరస్పాండెంట్ శైలజకుమారి తెలిపారు. 31 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రాంగణ ఎంపికల్లో 'ఆర్కే' విద్యార్థుల సత్తా



చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆర్కే డిగ్రీ కళాశాలలో బెంగళూరు బహుళ జాతీయ కంపెనీలు నిర్వహించిన ఇన్నోవేషన్ ప్రాంగణ ఎంపికల్లో ఫైనలియర్ డిగ్రీ విద్యార్థులు 16 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు కరస్పాండెంట్ బద్రీనారాయణ, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. రూ.6లక్షల వార్షిక వేతనానికి ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

దాతల సహకారంతో పంచలోహ కవచం



భైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): భైరెడ్డిపల్లెలోని బాటగంగమ్మ ఆలయంలో దాతల సహకారంతో గర్భగుడి ద్వారబంధానికి పంచలోహ కవచం ఏర్పాటు చేశారు. దాదాపు రూ2 లక్షలతో ఏర్పాటుచేసిన పంచలోహ తాపడం ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఆలయాభివృద్ధికి సహకారమందిస్తున్న పలువురు దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కొల్లావారిపల్లెలో పశువుల పండుగ

సోమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లె పంచాయతీ కొల్లావారిపల్లెలో ఆదివారం పశువుల పండుగ జరగనుంది. పశువులకు పరుగుల పోటీలు నిర్వహించనున్నారు. సోమ, మంగళవారం సల్లాపురమ్మ జాతర వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు.



పలమనేరుకు శనివారం చేరుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకట నారాయణభట్‌కి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

థామస్ దంపతులకు సన్మానం



పాలసముద్రం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ దంపతులను తిరుపతిలో పాలసముద్రం టీడీపీ నాయకులతో కలసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు శనివారం సన్మానించారు. నాయకులు శేఖర్‌రాజు, రవినాయుడు, అరుళ్‌నాథన్, సాంబశివన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు వెంకటేగౌడ హాజరు

పలమనేరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో శనివారం పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరై సంతకాలు పెట్టారు. ఎన్నికల అనంతరం ఆయనపై నమోదైన కేసులకు సంబంధించి ఆయన హైకోర్టులో ముందస్తు బెయిల్ పొందారు. హైకోర్టు సూచన మేరకు ఆయన పలమనేరు పోలీసు స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లారు. ఆయనతో పాటు పలువురు వైసీపీ నాయకులు పోలీసు స్టేషన్‌కు వచ్చారు.

రాజనాలబండలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

చౌడేపల్లె, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే కొండపై స్వయంభుగా వెలసిన లక్ష్మీ నరసింహస్వామికి, రాజనాలబండపై వెలసిన ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.